క్లుప్తంగా

నేడు శాకంబరిగా నూకాలమ్మ దర్శనం

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లో వేంచేసి ఉన్న గ్రామ దేవత నూకాలమ్మ అమ్మవారిని ఆదివారం శాకంబరిగా అలంకరించనున్నట్టు ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య శనివారం తెలిపారు. ఆషాఢ మాసంను పురస్కరించుకొని అమ్మవారిని కూరగాయలు, పండ్లతో అలంకరిస్తున్నామని తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవచ్చన్నారు.

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ


ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య

పెద్దాపురం: జవహర్ నవోదయ విద్యాలయం (2025–2026)లో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పెద్దాపురం విద్యాలయ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆరో తరగతి ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేశామన్నారు. ప్రస్తుతం కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాలోని 43 మండలాల నుంచి ప్రభుత్వ, గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులు పరీక్షలకు అర్హులన్నారు. సెప్టెంబర్ 16వ తేదీలోగా ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2025 జనవరి 18న మూడు జిల్లాల్లోని సుమారు 45 కేంద్రాల్లో పరీక్ష జరుగుతాయని, ఐదో విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రామకృష్ణయ్య కోరారు. ఆన్‌లైన్‌లో నవోదయ డాట్ జీఓవీ డాట్ ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఏసీటీ సైన్స్ శిక్షణ కేంద్రం పరిశీలన

పెద్దాపురం: స్థానిక రామారావుపేటలో అల్లం రాజు చారిట్రబుల్ (ఏసీటీ) శిక్షణ కేంద్రంలో కియా అసోషియేషన్ సంస్థ ప్రతినిధి బుద్దా శ్రీనివాస్ ఆధ్వర్యంలో నడుస్తున్న సైన్స్ శిక్షణ కేంద్రాన్ని శనివారం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప పరిశీలించారు. ప్రతి వారం ఉచితంగా సైన్స్ శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆయన వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

2న శాకంబరిగా అమ్మవారి దర్శనం

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత చాళుక్య కుమారా రామభీమేశ్వర స్వామి ఆలయంలో వచ్చే నెల 2వ తేదీన అమ్మవారు శాకంబరి అలంకరణలో దర్శనమివ్వనున్నారు. ఆషాఢ మాసం మాస శివరాత్రిని పురస్కరించుకొని బాలాత్రిపుర సుందరి అమ్మవారిని కూరగాయలు పండ్లతో అలంకరిస్తున్నట్టు ఈఓ భళ్ల నీలకంఠం తెలిపారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవచ్చన్నారు.

వీకే రాయపురం సర్పంచ్ మృతి


పూర్ణిమ (ఫైల్)

సామర్లకోట: వీకే రాయపురం సర్పంచ్ మోర్త పూర్ణిమ(44) శనివారం రాత్రి మృతి చెందారు. వీకే రాయపురం నుంచి తుని తన బంధువుల ఇంటికి కుమారునితో కలిసి మోటారుసైకిల్‌పై వెళుతుండగా తుని సమీపంలో తేటగుంట వద్ద మోటారుసైకిల్ నుంచి అదుపు తప్పి రోడ్డుపై పడి పోవడంతో తలకు బలమైన గాయమైన విషయం విధితమే. ఈ మేరకు కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి వై.శ్రీహరి తెలిపారు. ఆమె మృతిపై ఉప సర్పంచ్ గొల్లపల్లి సర్వేశ్వరరావు, గ్రామ నాయకులు, వార్డు సభ్యులు సంతాపం తెలిపారు.

టెన్షన్..టెన్షన్..


దివిలి జంక్షన్‌లో రాత్రి వేళ నిలిచిపోయిన వాహనాలు

- దివిలి జంక్షన్‌లో నిరంతర ట్రాఫిక్ సమస్య
- రోడ్డుపైకే దుకాణాలు
- గంటల తరబడిగా నిలిచిపోతున్న వాహనాలు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

పెద్దాపురం: నిత్యం రద్దీగా ఉండే సామర్లకోట–ప్రత్తిపాడు రహదారిలో దివిలి జంక్షన్‌లో నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. గంటల తరబడి వాహనాలు స్తంభిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

విద్య, వ్యాపారపరంగా అభివృద్ధి చెందిన పెద్దాపురం మండలం దివిలి, చంద్రమాంపల్లి గ్రామాల ప్రధాన రహదారి తరచూ ట్రాఫిక్ వలయంలో చిక్కుకుంటోంది. ఉదయాన్నే పాఠశాల, కళాశాలలకు వెళ్లాల్సిన విద్యార్థులు, ఉద్యోగులు, మెట్ట ప్రాంతంలోని ప్రధాన రాజకీయ పార్టీ ప్రజా ప్రతినిధులు, పాలకుల వాహనాలు ఇదే జంక్షన్ నుంచి వెళ్లాల్సిన దుస్థితి. అయినప్పటికీ ఏళ్ల తరబడిగా ఉన్న ట్రాఫిక్ సమస్యను మాత్రం పట్టించుకునే నాథులే కరువయ్యారు. రహదారి విస్తరణకు గాను గత పాలకులు ప్రణాళిక బద్ధంగా రోడ్డు విస్తరణ పనులు చేపడతామని హామీ ఇచ్చినా అది కాస్త అటకెక్కించారు. అటు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం కాక, ఇటు ట్రాఫిక్ సమస్య పరిష్కారం కాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రోడ్డు విస్తరణకు మార్జిన్లు ఇచ్చినప్పటికీ..

ఇరుకు రోడ్డు ఆపై రోడ్డుపైకి ఆనుకుని దుకాణాలు ఏర్పాటు చేయడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోంది. దీంతో ప్రభుత్వం రోడ్డు విస్తరణ పనులకు చర్యలు చేపట్టింది. రోడ్డుపై ఉన్న ఆయా దుకాణాల తొలగించా మార్జిన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నప్పటికీ సంబంధిత అధికారుల పనితీరు 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా తయారైంది. నిత్యం రద్దీగా ఉండే రహదారి విస్తరణ పనులు చేపడుతున్నారని నిత్యం ట్రాఫిక్ రద్దీ కారణంగా పడుతున్న ఇబ్బందులు తప్పడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆక్రమణలలో..

అసలు కన్నా కొసరు మిన్నా అన్నట్టుగా తయారైంది చంద్రమాంపల్లి గ్రామ వ్యాపారుల దుస్థితి. రోడ్డు విస్తరణ పనుల్లో అవసరమైన మార్జిన్ మేరకు దుకాణాలు తొలగించకపోయినా ఆయా దుకాణాల వద్ద ఎదురుగా అద్దెలకు వేరే దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్ సమస్య తెలెత్తుతుందనడంలో ఏ మాత్రం సందేహం లేదు. గత ఏడాది కిందట పెద్దాపురం ఎస్ఐ వెలుగుల సురేష్ దుకాణాలను ఖాళీ చేయించి వెనక్కి జరిపించారు. ఆరు నెలలు గడవకుండానే దుకాణాదారులు మళ్లీ రోడ్డుపైకి రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. ఇప్పటికైనా సంబంధిత శాఖాధికారులు, పాలకులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


ఉదయం వేళ దివిలి జంక్షన్‌లో నిలిచిన ట్రాఫిక్

నోటీసులు జారీ చేసినా..



దివిలి ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపట్టతామన్న గత పాలకుల హామీ ఇచ్చారు. అయితే అది ఆచరణకు నోచుకోలేదు. రోడ్డుపై ఉన్న దుకాణాలను తొలగించాలని, లేదంటే వెనక్కి జరపాలని అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా ఎవరూ పట్టించుకోలేదు. అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి.

– వట్టికూటి రాజ్‌కుమార్, నిరుద్యోగి, దివిలి, పెద్దాపురం మండలం

సిబ్బందిని నియమించాం



చంద్రమాంపల్లి (దివిలి) జంక్షన్‌లో ట్రాఫిక్ నియంత్రణకు సిబ్బందిని నియమించాం. ప్రతి రోజూ ట్రాఫిక్ పోలీసును ఏర్పాటు చేసి క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకుంటున్నాం. విస్తరణ పనులకు మిగిలిన శాఖాధికారులు ముందుకు వస్తే ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. దుకాణాలను ముందు జరిపిన వారిపై చర్యలు తీసుకుంటాం

– వెలుగుల సురేష్, ఎస్ఐ, పెద్దాపురం

న్యాయ సంహిత క్రిమినల్ చట్టాలపై అవగాహన

పిఠాపురం: మహిళలు, బాలల చట్టాలు, భారతీయ న్యాయ సంహిత క్రిమినల్ చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పిఠాపురం ఐసీడీఎస్ అధికారి సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి సూచించారు. మిషన్ శక్తి 100 రోజుల అవగాహన కార్యక్రమంలో భాగంగా పిఠాపురం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద శనివారం ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన, మహిళలు, బాలల చట్టాలు, భారతీయ న్యాయ సంహిత క్రిమినల్ చట్టాలపై గర్భిణులు, బాలింతలు, ప్రజలకు అవగాహన కల్పించారు. నూతన చట్టాల వలన కలిగే ప్రయోజనాలను వివరించారు. చట్టాల అమలు, అంతర్గత కమిటీల ఏర్పాటు, ఎవరు సభ్యులుగా ఉంటారు అనే విషయాలపై అవగాహన కల్పించారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురైతే ఈ చట్టాల ద్వారా రక్షణ పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సిబ్బంది, పీహెచ్‌సీ సిబ్బంది, సూపర్‌వైజర్ మానసదేవి, నాగమణి, మణి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


పిఠాపురంలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

జూనియర్ కళాశాల అప్‌గ్రేడ్‌కు కృషి


జూనియర్ కళాశాల విద్యార్థులకు కిట్లు అందజేసిన ఎమ్మెల్యే రాజప్ప


నాగులపల్లిలో విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందిస్తున్న నాయకులు

- ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప
- విద్యార్థులకు కిట్లు పంపిణీ

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలను పరిష్కరించి, డిగ్రీ కళాశాల అప్‌గ్రేడ్‌కు కృషి చేస్తామని ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలతో కూడిన కిట్ల పంపిణీ కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. విద్యార్థులకు కిట్లు అందజేసిన అనంతరం మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. విద్యార్థులు సాంకేతిక విద్యపై దృష్టి సారించాలన్నారు. ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, జెడ్పీటీసీ సభ్యుడు ఎలిశెట్టి అమృత, ఎంఈఓలు వై.శివరామకృష్ణయ్య, పి.పుల్లయ్య, కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ లీలాశ్రీదేవి, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న వాకింగ్ ట్రాక్కు సమస్యను పరిష్కరించాలని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సత్కరించారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

కొత్తపల్లి: విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమని వైఎస్సార్ సీపీ నాయకుడు, సైకాలజిస్ట్ వడిశెట్టి నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని నాగులపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు శనివారం స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేసిందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యా బోధనను అందిస్తున్నారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని సూచించారు. కార్యక్రమంలో గుర్రాల కల్యాణ్‌రెడ్డి, వడిశెట్టి రామకృష్ణ రెడ్డి, పాపిరెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ చింతపల్లి వెంకటరమణ, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు

- పంచాయతీ రాజ్ డైరెక్టర్ ఎంవీఆర్ కృష్ణతేజ
- పలు గ్రామాల్లో పర్యటన


వాకతిప్ప తాగునీటి పథకం నమూనాను పరిశీలిస్తున్న కృష్ణతేజ

కొత్తపల్లి: గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్టు పంచాయతీ రాజ్ డైరెక్టర్ ఎంవీఆర్ కృష్ణతేజ తెలిపారు. మండలంలో శనివారం ఆయన పర్యటించారు. వాకతిప్ప శివారు నాగులాపల్లి ఏరియా రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. వేసవిలో తాగునీటి సమస్య రాకుండా నూతనంగా ఏర్పాటు చేయనున్న సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుకు చెరువు సమస్యను అధికారులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. అమరవల్లిలో రైతు పండిస్తున్న జామతోట, పంచాయతీ స్థలంలో వేసిన కొబ్బరితోటను ఆయన పరిశీలించారు. కొత్తమూలపేటలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో పర్యటించినట్టు తెలిపారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల ఏర్పాటుకు రైతులు పంచాయతీల నుంచి అన్ని అనుమతులు పొందాలన్నారు. ఈ స్టోరేజ్ ట్యాంకును జల్ జీవన్ మిషన్‌లో నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రైతులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శ్రీరామచంద్రమూర్తి, డ్వామా పీడీ అడపా వెంకటలక్ష్మి, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ల యూనియన్‌కు స్థలం కేటాయించాలి

కొత్తపల్లి: మండల పర్యటనకు వచ్చిన పంచాయితీ రాజ్ డైరెక్టర్ కృష్ణతేజను శనివారం మండల ఫొటోగ్రాఫర్ యూనియన్ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిశారు. మండల ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం మాజీ కార్యదర్శి పుచ్చల బంగారుబాబి, పలువురు ఫొటో అండ్ వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

సాగు హక్కు కార్డులు సద్వినియోగం చేసుకోవాలి


కౌలు రైతులకు కార్డులు అందజేసిన ఏఓ సత్య

సామర్లకోట: కౌలు రైతులకు అందజేస్తున్న సాగు హక్కు కార్డులను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఐ.సత్య అన్నారు. శనివారం ఉండూరు గ్రామంలో కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలం 6,100 మందికి సాగుహక్కు కార్డులు మంజూరయ్యాయని తెలిపారు. కౌలు రైతుకు బ్యాంకు నుంచి ఎకరానికి రూ.40 వేల వరకు రుణం అందజేస్తారని, ఈ రుణాన్ని పంట పెట్టుబడికి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బ్యాంకులకు రుణ బకాయి ఉన్న వారికి ఇచ్చే అవకాశం లేదని చెప్పారు. ఒకే సర్వే నంబరు కింద ఉన్న భూమికి భూమి యజమాని రుణం తీసుకొని ఉంటే ఐదుగురు కౌలు రైతులు సంఘంగా ఏర్పడితే వారికి రూ.రెండు లక్షల రుణం ఇస్తారన్నారు. సంఘంలో ఉన్న రైతులు అందరూ సకాలంలో రుణాలు చెల్లించాలని సూచించారు. ఇటీవల వర్షాలకు నీట మునిగిన పంట భూములకు సంబంధించి అధికారులకు నివేదిక అందజేయాలన్నారు. ఏఈఓ శాంతికమల, వీఏఏలు, కౌలు రైతులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

బోట్‌క్లబ్: స్థానిక టూటౌన్ సమీపంలోని హరీష్ స్పోర్ట్స్ వద్ద డొక్కా సీతమ్మ అన్నపూర్ణాదేవి సేవా సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. సంఘం చైర్మన్ తలాటం హరీష్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నిరుపేదలు కోసం ప్రతి శనివారం అన్నదానం చేస్తున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని అమృత హాస్పిటల్ ఎండీ చిట్ల కిరణ్, రజిని కోటయ్య స్వీట్స్ అధినేత రామ్‌కుమార్, పినిశెట్టి సురేష్, కరప తాతీలు సౌజన్యంతో నిర్వహించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు నిర్వాహకుడు ఇన్నకోట సురేష్ శనివారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. బీపీ, సుగర్ పరీక్షలు చేసిన అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

31న మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

సామర్లకోట: ప్రతి నెల జరిగే కౌన్సిల్ సాధారణ సమావేశంలో భాగంగా ఈ నెల 31వ తేదీన ఉదయం 11 గంటలకు సాధారణ సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ అధ్యక్షతన జరగనుంది. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో అన్నిశాఖల అధికారులు అభివృద్ధి పనుల వివరాలు తదితర అంశాలతో హాజరుకావాలని కోరారు.

ఆర్థిక సంఘం నిధులు నష్టపోతున్న గ్రామాలు

కాకినాడ రూరల్: మండలంలోని ఆరు గ్రామాలకు పంచాయతీ ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఆర్థిక సంఘం నిధులు నష్టపోతున్నాయని, వాటిని ఆదుకోవాలని రమణయ్యపేట మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 1994, 73వ రాజ్యాంగ సవరణ ప్రకారం ప్రతి ఐదేళ్లకు స్థానిక సంస్థలు ఎన్నికలు జరగాల్సి ఉండగా కాకినాడ రూరల్‌లో రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల, తూరంగి, ఇంద్రపాలెం, చీడిగ గ్రామాలకు ఎన్నికలు జరగడం లేదన్నారు. దీని వల్ల ఆయా పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘ నిధులు జమ కాలేదన్నారు. ఒక్క రమణయ్యపేట గ్రామం ఏడాదికి రూ.2.5 కోట్లు నష్టపోతుందని, దీని ప్రభావం అభివృద్ధిపై పడుతుందన్నారు. తక్షణం ఎన్నికలు నిర్వహించాలన్నారు.

ప్రజా ఫిర్యాదులకు ప్రాధాన్యం

కాకినాడ: ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ, డయల్ యువర్ కమిషనర్ ద్వారా వచ్చిన ప్రతి ఒక్క ఫిర్యాదులకు పరిష్కారాన్ని అందించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన అధికారులను ఆదేశించారు. ప్రజాఫిర్యాదుల పరిష్కార ప్రగతిపై శనివారం అన్ని విభాగాధిపతులతో కమిషనర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకూ వచ్చిన ఫిర్యాదులు ఎన్ని? ఎన్ని పరిష్కారమయ్యాయి? ఇంకా ఎన్ని పరిష్కరించాల్సి ఉంది? పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులకు కారణాలు ఏమిటీ వంటి అంశాలపై ఆరా తీశారు. ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమంగా ఉన్న ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. ముఖ్యంగా ఆయా విభాగాధిపతులు వచ్చిన ఫిర్యాదులను స్వయంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు, ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకటరావు, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, డీసీపీ నాగశాస్త్రులు, ఉద్యాన సహాయసంచాలకులు టీవీ శిరిల్, ఈఈ మాధవి, ఇతర విభాగాధిపతులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలాంకు ఘన నివాళి

కరప: గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం మాజీ రాష్ట్రపతి, భారతరత్న, అబ్దుల్ కలాం వర్ధంతిని నిర్వహించారు. అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఎ.సాయిమోహన్ మాట్లాడుతూ వికసిత్ భారత్ సాధించాలంటే విద్యార్థులు నైపుణ్యంతో అద్భుత ఆవిష్కరణలు చేయాలన్నారు. అంతరిక్ష పరిశోధనలో అనేక రాకెట్లు, శాటిలైట్స్ ప్రయోగంలో, మిస్సైల్స్ తయారీలో అబ్దుల్ కలాం అనేక విజయాలు సాధించారన్నారు. శాస్త్రవేత్తంగా, రాష్ట్రపతిగా భారతరత్న అబ్దుల్ కలాం అందించిన సేవలను కొనియాడారు. స్టాఫ్‌సెక్రటరీ ఐ.ప్రసాదరావు, ఉపాధ్యాయులు వీవీ రమణమూర్తి, వీజేవీ శోభాకర్, ఎ.సూర్యనారాయణ, ఎస్.నాగలింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


సామర్లకోట బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో మొక్కలు నాటిన ఏఎంఓ రామారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు

సామర్లకోట: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ మేడపాటి రామారెడ్డి అన్నారు. శనివారం స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ హెచ్ఎం, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ వార్డు గ్రహీత తోటకూర సాయిరామకృష్ణ పర్యవేక్షణలో ఎకో క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కలు నాటు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మానవ శ్రేయస్సుకు ఉపయోగపడే ప్రకృతిని కాపాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణ పరిరక్షణ కోసం ఏటా మొక్కలు నాటడంపై చర్యలు తీసుకొంటున్నా వాటి సంరక్షణ సక్రమంగా లేక పాడైపోతున్నాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ నాటిన మొక్కను రక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏకో క్లబ్ కన్వీనర్ ఎఎల్‌వీ కుమారి, ఉపాధ్యాయులు కె.శ్రీనివాసు, బాలశైలజ శేషారత్నం, వి.రాజు, జి.గోవిందు, కె.అరుణ పాల్గొన్నారు. అదే విధంగా స్థానిక మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న కాపు కల్యాణ మండపంలోను, పెద్దాపురం–సామర్లకోట ఏడీబీ రోడ్డు డివైడర్‌లోను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

పెద్దాపురం: పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తుమ్మల పద్మజ అన్నారు. తల్లి పేరు మీద మొక్క కార్యక్రమంలో భాగంగా శనివారం పెద్దాపురం ఏరియా ఆసుపత్రి వద్ద జరిగిన కార్యక్రమంలో ఆమె మొక్కలు నాటారు.

ఘనంగా వేగుళ్లమ్మ జాతర

గోకవరం: మండలంలోని గుమ్మళ్లదొడ్డిలో గ్రామదేవత వేగుళ్లమ్మ జాతర శనివారం ఘనంగా జరిగింది. జాతరను పురస్కరించుకుని గత మూడు రోజులుగా ఆలయం వద్ద వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉదయం మహిళలు, ఆడపడుచులు అమ్మవారి బోనాలతో గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. బోనాలతో అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిరు వ్యాపారులకు టెండర్!

- షాపింగ్ కాంప్లెక్స్ వేలాన్ని వాయిదా వేసిన అధికారులు
- వాయిదా వెనుక మర్మమేమిటో ?
- సొంతోళ్లకు అప్పనంగా కట్టబెట్టడానికేనా!
- కూటమి నేతల తీరుపై వ్యాపారుల అసహనం

కాకినాడ: సొంతపార్టీకి చెందిన వ్యక్తులకు అప్పనంగా కట్టబెట్టేందుకు ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాల సముదాయ వేలాన్ని వాయిదా వేయించిన వ్యవహారం విమర్శలకు తావిస్తోంది. కూటమి నేతల ఒత్తిడికి లొంగి నగరపాలక సంస్థ అధికారులు సైతం సదరు వేలాన్ని వాయిదా వేయడంతో ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇదంతా అధికార పార్టీ నేతల ఒత్తిడితోనే జరిగిందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

ఇదీ సంగతి

వివరాల్లోకి వెళ్తే కాకినాడ 12వ డివిజన్ సంజయ్‌నగర్‌లో నిర్మించిన 24 దుకాణాల సముదాయాన్ని నిబంధనల ప్రకారం వేర్వేరు సామాజిక వర్గాలకు కేటాయించేందుకు వీలుగా ఈ నెల 11వ తేదీన నగరపాలక సంస్థ టెండర్లు పిలిచింది. బహిరంగ వేలం ద్వారా దుకాణాలను కేటాయించేందుకు అవసరమైన నిబంధనలను కూడా సదరు వేలం నోటీసులో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే పట్టుమని నాలుగు రోజులు గడవకముందేన ఈ నెల 16వ తేదీన ముందుగా పిలిచిన వేలం ప్రకటనను అనివార్య కారణాలతో వాయిదా వేస్తున్నామని, తదుపరి తేదీ త్వరలో ప్రకటిస్తామంటూ మరో ప్రకటన జారీ చేశారు.


షాపింగ్ కాంప్లెక్స్ దగ్గర చిరు వ్యాపారులను ఖాళీ చేయిస్తున్న పోలీసులు


నగరపాలక సంస్థ కాకినాడ
...సి.నెం.697/2024/29 తేది:16-07-
పత్రిక ప్రకటన
కమిషనరు నగరపాలక సంస్థ, కా

టెండర్‌ను వాయిదా వేస్తూ ఇచ్చిన ప్రకటన

అసలేం జరిగిందంటే..

గత ప్రభుత్వ హయాంలో గడపగడపకూ మన ప్రభుత్వంలో భాగంగా అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి సంజయ్‌నగర్ వెళ్లిన సందర్భంలో రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు చేసుకునే వారంతా ఆయనను కలిసి తమకు శాశ్వత దుకాణాలు నిర్మించాలని మొరపెట్టుకున్నారు. ఆ మేరకు ఆ ప్రాంతంలో ఉన్న స్థలంలో నగరపాలక సంస్థ ద్వారా 24 దుకాణాలను నిర్మించి స్థానిక వ్యాపారులకు అప్పగించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు అనుమతిచ్చే సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో అధికారులు ఫైల్ పక్కన పెట్టారు. అప్పటికే సుమారు 15 మంది కూరగాయలు, చికెన్ దుకాణాలు, చిన్నచిన్న ఫ్యాన్సీ షాపులను కూడా పెట్టుకుని జీవనాన్ని సాగిస్తున్నారు.

దౌర్జన్యంగా ఖాళీ చేయించి..

ఇదిలా ఉండగా ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఈ నెల మొదటి వారంలో అక్కడి చిరువ్యాపారులను బలవంతంగా రోడ్డున పడేశారు. అనుమతి లేకుండా షాపింగ్ కాంప్లెక్స్‌లో వ్యాపారాలు చేస్తున్నారంటూ నగరపాలక సంస్థ అధికారులు వీరితో బలవంతంగా ఖాళీ చేయించారు. దీంతో వ్యాపారులంతా లబోదిబోమంటూ గగ్గోలు పెట్టారు. పదిహేనేళ్లుగా రోడ్డుపక్కన వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమపై ఇలా దౌర్జన్యంగా వ్యవహరించడం ఏమిటంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పత్రికల ద్వారా బయటి వ్యక్తులకు కేటాయించేందుకు వీలుగా టెండరు ప్రకటన కూడా జారీ చేశారు. అయితే పట్టుమని నాలుగైదు రోజులు గడవకుండానే ఆ టెండర్‌ను రద్దు చేయడం అనేక విమర్శలకు తావిస్తోంది. పేద వర్గాలను ఖాళీ చేయించిన అధికారులు టెండర్ ప్రక్రియ ద్వారా కొత్తవారికి కేటాయించడంలో ఎందుకు వెనుకంజ వేస్తున్నారన్న సందేహం వ్యక్తమవుతోంది. అధికార టీడీపీకి చెందిన ప్రజాప్రతినిధులు, నేతల ఒత్తిడితోనే టెండర్లు రద్దు చేశారన్న ఆరోపణ వ్యక్తమవుతోంది.

కమిషనర్ మేడమ్.. స్పందించండి

నిబంధనలకు విరుద్ధంగా సంజయ్‌నగర్ దుకాణాల కేటాయింపు వేలాన్ని రద్దు చేసిన వ్యవహారంపై కమిషనర్ భావన దృష్టిపెట్టాలని అక్కడి వ్యాపారులు కోరుతున్నారు. వాస్తవాలను పరిశీలించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్‌ను వివరణ కోరగా పరిపాలన పరమైన కారణాలతోనే వాయిదా వేశామని, నూతన కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే మళ్లీ టెండర్లు పిలుస్తామని చెబుతున్నారు.